# ముగింపు ఇంతే!

నాగభైరవ ఆంజనేయులు



ఆ రోజు —

సరిగ్గా సాయంత్రం నాలుగ్గంటల నలభై రెండు నిముషాలకు నాంపల్లి స్టాప్‌లో బస్ కోసం వెయిట్ చేస్తున్న ప్రసాద్‌కు ఆ ప్రక్కనే నిలబడి మాట్లాడుకుంటున్న కాలేజీ గరల్స్ మాటలు వినబడ్డాయి. గతవారం పత్రిక వీక్లీలో వచ్చిన 'నిర్ణయం' కథగురించి చర్చించుకుంటున్నారు వాళ్ళు. వారి సంభాషణ కుతూహలంగా విన్నాడు ప్రసాద్. సన్నగా మెరుపు తీగలావున్న అమ్మాయికి ఆ కథ ఎక్సలెంట్‌గావుందట. మిగతా ఇద్దరికీ ఆకథ చెత్తగా వుందట. కథ ఎక్సలెంట్‌గావున్న అమ్మాయివైపు ప్రసాద్ ఒక్కక్షణం పరీక్షగా చూశాడు. లక్షల ఆస్తిని కాదని పేదవాడిని చేసుకున్న యువతి కథే నిర్ణయం.

కాసేపు తటపటాయించి చివరకు ఉత్సాహంగా వారి దగ్గరకెళ్ళి 'నాపేరు ప్రసాద్' అన్నాడు ఎటోచూస్తూ.

"చాలా బావుంది" అంది పిల్లికళ్ళమ్మాయి.

"అయితే ఏమిటంటా" అని ప్రశ్నించింది కీచుగొంతమ్మాయి.

ఏమీ అర్థంగాక అయోమయంగా చూసింది మెరుపుతీగ.

"వీక్లీలో నిర్ణయం కథ వ్రాసింది నేనే"

"ఈ ముఖానికితోడు కథలు వ్రాయటం కూడానా!" అన్నట్లు చూశారు పిల్లికళ్ళు, కీచుగొంతు.

'నిజంగానా' కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూస్తుండగా అడిగింది మెరుపుతీగ.

"అమ్మాయిలతో మాట్లాడటానికి ఇదో కొత్తరకం నాటకం" పెదవి విరుస్తూ అంది కీచు గొంతు.

ప్రసాద్‌కు వళ్ళుమండింది. కోపంగా కీచుగొంతువైపుచూస్తూ జేబులోవున్న ఎం. ఓ. కూపన్ తీసి చూపించాడు.

"2-8-74 వ తేదీ ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురితమైన నిర్ణయం కథకు పారితోషికం" అని వుంది కూపన్‌లో.

మెరుపుతీగ ముఖంలో సంతోషం గంతులేసింది. ఉత్సాహం ఉరకలు వేసింది కళ్ళలో మెరుపు మెరిసించి.

"రచయిత ప్రసాద్ మీరేనా. చాలా ఆనందంగావుంది.-ఏదో చెప్పలేని అనుభూతి. మీరు వుండేది హైద్రాబాదులోనేనా" ప్రశ్నించింది.

ఆమె ఆనందానికి ప్రసాద్ ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

"అవునండీ. ఎ.జి. ఆఫీస్‌లో యు డి.సి."

"నేను మీ కథల్ని బాగా లైక్ చేస్తాను. కథలో కొత్తదనం, పాత్రల్లో వైవిధ్యం, శైలిలో నూతనత్వం మీ కథల్లో ప్రత్యేకతలు. వీక్లీలో మీపేరు కనుపిస్తే-ముందుగా ఆకథ చదివిగాని మిగతా పేజీలు చూసేది తెలుగులో వున్న కొద్దిమంది గొప్ప రచయితల్లో మీ రొకరు. చాలాసార్లు మీకు వుత్తరం వ్రాసి

పరిచయం చేసుకుందామనిపించింది ... కాని ఉత్తరాలు వ్రాయాలంటే మహాబద్ధకంనాకు. అందుకే వ్రాయలేదు'' పరిసరాల్ని మర్చిపోయి సంతోషంతో బాగా ఏక్సయిటయి మాట్లాడుతుంది మెరుపుతీగ. ఆ మాటలు వింటూ గర్వంతో పొంగిపోతున్నాడు ప్రసాద్.

పిల్లి కళ్ళు, కీచుగొంతు మెరుపుతీగ భుజం తట్టి, 'ఏమిటీ ప్లాట్‌ఫాం లెక్చర్' అని అన్నారు సన్నగా.

''మీ అభిమానానికి చాలా థాంక్సండీ'' అన్నాడు ప్రసాద్.

''నా పేరు ప్రభ. ఇది మా ఇంటి అడ్రస్. సండే ఈవనింగ్ రండి. ఎదురు చూస్తుంటా. మీతో చాలా మాట్లాడాలి'' అంటూ వానిటీ బాగ్‌లోనుండి విజిటింగ్ కార్డు అందించింది మెరుపు తీగ...నో...ప్రభ.

అలా మొదలయింది ప్రభ – ప్రసాద్‌ల పరిచయం.

*      *      *

ఆదివారం సాయంత్రం ప్రభ వాళ్లింటికి వెళ్ళాడు ప్రసాద్. అతనికోసమే ఎదురు చూస్తున్నట్టు వీధి గుమ్మంలో నిలబడివుంది ప్రభ. చిరునవ్వుతో ఆహ్వానించి లోనికి దారి తీసింది. ప్రసాద్ ఆమెను అనుసరించాడు. లాన్‌లో వేసున్న పేము కుర్చీల్లో కూర్చున్నారు ఇద్దరూ.

ప్రసాద్ గతంలో వ్రాసిన కథల గురించి, ఏ కథ ఎక్కడ గొప్పగా వున్నదీ ఆ కథలు తనకు నచ్చిన కారణాలను ఏకధాటిగా చెప్పుకపోతుంది ప్రభ. కొన్ని కథలను కొద్దిగా మార్చి వుంటే యింకా మంచిఎఫెక్టు వచ్చి వుండేదని ఆ మార్పులను సూచించింది. ఆమె మాటలు వింటున్న ప్రసాద్‌కు ఒళ్ళంతా పులకింతగా, మనసంతా గిలిగింతగా వుంది. ఆమె పొగడ్తలకు మధురానుభూతిలో తేలిపోతున్నాడు. ఆమెజ్ఞాపకశక్తినికొనియాడాడు. ఆమె విమర్శనా దృష్టిని మెచ్చుకున్నాడు.

*      *      *

ప్రభ లేచివెళ్ళి కాఫీ తెచ్చిచ్చింది. ఆమె చూపుల్లో పండిన అభిమానానికి పొంగిపోయాడు ప్రసాద్. అతని రచనలమీద ప్రభ చూపుతున్న ఆసక్తికి గర్వపడ్డాడు.

లోకం చీకటి దుప్పటిని కప్పుకునేవేళ ప్రసాద్ ప్రభ దగ్గర వీడ్కోలు పుచ్చుకున్నాడు.

ప్రతి ఆదివారం సాయంత్రం ప్రసాద్ ప్రభ వాళ్ళింటికి వెళ్ళేవాడు. చీకటి పడేవరకు నేడు వస్తున్న కథల గురించి, పత్రికల గురించి చర్చించుకునేవాళ్ళు. కథకుల దృక్పథం మారాలని, సమాజ వికాసానికి పనికొచ్చే రచనలే రచయితలు చేయాలని ప్రభ చెప్పినపుడు ప్రసాద్ ఆమెతో ఏకీభవించేవాడు. కొత్తగా వ్రాసిన కథలు ముందుగా ప్రభకు చదివి వినిపించేవాడు. ఆమె ఏవైనా మార్పులు సూచిస్తే అలా మార్చేవాడు కథను. ప్రభ బాగాలేవన్న రెండు మూడు కథలను చించిపడేశాడు, పత్రికలనుండి కథల ప్రచురణను అంగీకరించినట్లు వుత్తరాలు వస్తే వాటిని ముందుగా ప్రభకు చూపేవాడు. అచ్చయిన కథలను ఆమెకు ప్రత్యేకంగా చూపి కథకు ఆర్టిస్ట్ వేసిన బొమ్మనుగురించి ముచ్చటించేవాడు. ప్రసాద్ కథలను ప్రభ మెచ్చుకుంటుంటే అతని హృదయం పరవశించేది. ప్రభ అతన్ని పొగుడుతుంటే మనసు ఆనందంతో పల్లవించేది.

*      *      *

ప్రసాద్ ప్రభల పరిచయమయి ఆరు నెలలయింది. సెక్షన్ మేనేజర్ మరోచోటుకి బదిలీ అవుతున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆయనకు వీడ్కోలుపార్టీ ఏర్పాటు చేశారు ఏ. జి. ఆఫీసులో. ఆ ఫంక్షన్‌కు ప్రసాద్ కూడా అటెండయాడు. పార్టీ పూర్తయేటప్పటికి రాత్రి ఎనిమిదయింది. రూంకి చేరి పడుకున్నాడేగాని ఎంతకీ నిద్ర పట్టలేదు. ప్రభ గుర్తుకు రాసాగింది. తన కథల్ని అభిమానించే వేలాది పాఠకుల్లో ప్రభ ఒకతి. ఆమెను చూడాలన్న తాపత్రయం, ఆరోజు కలిసి మాట్లాడలేదన్న వెలితి అతని మనసుని నలిపేశాయ్. భారంగా తెల్లవారింది. ఆఫీసుకి వెళ్ళాడుగాని ఏ పనీ చేయాలనిపించలేదు. చాలా బద్ధకంగా వుంది. గడియగడియకు గడియారం వంక చూడసాగాడు. ఆరోజు మొదటిసారిగా ప్రసాద్ గ్రహించాడు– ప్రభను తాను ప్రేమిస్తున్నట్టు. ఆ ఆలోచనతో అతనిమనసు కుదుటపడింది. ప్రభకు తానంటే తగని అభిమానం. అంతకుమించిన గౌరవం. ఆమెను జీవిత భాగస్వామిగా చేసుకోవాలని అతని హృదయం ఆరాటపడసాగింది. ఈ విషయం ఆమెకు వెల్లడించాలని మనసు తహ తహ లాడింది.

సాయంత్రం ఐదయింది. ఆఫీసునుంచి నేరుగా ప్రభవాళ్లింటికి వెళ్ళాడు ప్రసాద్.

## ప్రశ్న ?

వ్యవస్థ మారాలని<br>
గొంతు చించుకుంటున్న కవి<br>
రోజూ సానికొంపకు పోవడం చూచి,<br>
టీ కొట్టు ముసలయ్య<br>
గొంతెత్తి అడిగాడు<br>
కవీ !<br>
రొంపిలో కూరుకుపోయి<br>
కళంకితమైన<br>
పడచుల జీవితాల్ని<br>
పవిత్రం చేస్తానని ఘోషించి,<br>
వాళ్ళను మళ్ళీ<br>
పెను రొంపిలోకి త్రోస్తున్న<br>
నీవేనా<br>
ఈ వ్యవస్థను మార్చేది అని ?

—పాయసం సుబ్రహ్మణ్యం

'ఏ కథన్నా ప్రచురణకి అంగీకరించినట్లు వుత్తరం వచ్చిందా పరుగెత్తుకుంటూ వచ్చారు' అంది కూర్చోమని కుర్చీ చూపుతూ. సంతోషంగా మెత్తగా నవ్వుతూ కుర్చీలో కూలబడ్డాడు ప్రసాద్. 'కాఫీతెస్తా' నంటూ లోనికి పోయింది ప్రభ.

ఎలాగయినా ఈ రోజు తన మనసులోని మాటను ప్రభకు చెప్పేయాలి. ఎలా చెబితే అందంగా, ఆకర్షణీయంగా వుంటుందో ఆలోచిస్తున్నాడు ప్రసాద్. ''ఎందుకో ఈ పరాకు'' అంది కాఫీ కప్పుతో వచ్చిన ప్రభ పరధ్యానంగావున్న ప్రసాద్‌నిచూసి. 'ఏం లేదు' అన్నాడు ఆమెముఖంలోకి చూస్తూ. ప్రభలో క్రొత్త సౌందర్యం కనుపించింది ప్రసాద్‌కి. కప్పును అందుకొని కాఫీ సిప్ చేశాడు.

''ప్రభా! నిన్నొక మాట అడగాలనుకుంటున్నా'' ఆమె కనురెప్పలవైపు చూస్తూ అన్నాడు ప్రసాద్.

ఆమె మెత్తగా నవ్వింది. 'అలాగే' అంది.

''బాగా ఆలోచించి చెప్పాలి. నీవు నా భాగస్వామివయితే నా జీవితానికి పరిపూర్ణత

గృహిణులకు శుభవార్త!
కరెంటు కవ్వం
5 నిముషములలో వెన్న తయారు
నెలకు 5 పైసలు కరెంటు ఖర్చు
ధర రు. 250 మాత్రం
తయారీ దారులు :
సోనోవిజన్,
ఏలూరురోడ్, విజయవాడ-2.

40సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
వివరములకు:
రె అండ్ కో రిజిస్టర్డు ఆసుపత్రి
గౌలిగూడ నయబస్ డిపో ఎదుట,
బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్‌ఫోన్ 42870, ఇంటిఫోన్ 38544

క్రొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.


మూడు సైజులలో లభిస్తుంది
50 మిలి
100 మిలి
200 మిలి
అమృతాంజన్ ఆముదము ఆరోగ్యవంతమైన కుటుంబాలకు
OBM 3270A TG

## ముగింపు ఇంతే

ఏర్పడుతుందనిపిస్తుంది అదీగాక నామనసులో నీమీద ప్రేమ వున్నట్టు ఈ రోజే గ్రహించాను'' నేలకేసి చూస్తూ అన్నాడు ప్రసాద్.

ప్రభ ఒక్క క్షణం నివ్వెరపోయింది. మరుక్షణంలోనే తెప్పరిల్లింది. నాలుకతో పెదాల్ని తడిచేసుకొంది. గొంతు పెగల్చుకొని

''ప్రసాద్‌గారూ! నా ప్రవర్తన మీ మనసులో ఆ అభిప్రాయం ఏర్పడటానికి దోహదమయితే మన్నించండి. మీరు గొప్ప రచయితలు. మంచి కథలు వ్రాస్తారు. రచనలో మీకున్న ప్రతిభకు ముగ్దురాలనై రచయితగా మిమ్మల్ని ఆరాధిస్తున్నాను గొప్ప రచయితగా మిమ్మల్ని గౌరవిస్తున్నా ఇది నా వ్యక్తిగత విషయం

''పోతే... పెళ్లి మీకూ నాకూ మధ్య అంతస్తుల అగాధం చాలా లోతుగా వుంది. ఇద్దరిమధ్యా అడ్డుగోడలు చాలా ఎత్తుగా ఉన్నాయ్ మీరు యు. డి సి వెనక ఆస్తి అంతగాలేదు మా నాన్న కొన్ని లక్షలకు అధిపతి తన ఏకైక కుమార్తెను మధ్య తరగతి మనిషికిచ్చి పెళ్లి చేసే విశాల హృదయం ఆయనకు లేదు ఆయన్ను ఆయనకున్న ఆస్తిని కాదని మీతో వచ్చేయటానికి– ఇది మీరు వ్రాసే కథ కాదు. జీవితం. కథల్లో జరిగినట్లు జీవితంలో జరుగుతాయని అనుకోవటం మన భ్రమ మాత్రమే డబ్బులో, దానితో వాటిల్లే సుఖాల్లో పెరిగిన ఏ పిల్లా వాటికి దూరమవదు కథల్లోలా.

''క్షమించండి. మంచి స్నేహితులుగా మీ కెప్పుడూ నా మనసులో చోటుంటుంది''

ఆ మాటలు వింటున్న ప్రసాద్‌కి ముచ్చెమటలు పోశాయి అగాధంలో కూరుకపోతున్నట్లు ఫీలయాడు. తల దిమ్మెక్కింది.

'వస్తా' అని సమాధానంకోసం ఆగకుండా చరచరా నడుచుకుంటూ బయటపడ్డాడు ప్రసాద్.

ఆ తర్వాత ప్రభకు మరెప్పుడూ కనిపించలేదు ప్రసాద్. అతని కథల్ని మాత్రం అడపాదడపా పత్రికల్లో పడినప్పుడల్లా చదువుతుంది ప్రభ. అదివరకులాగానే మెచ్చుకుంటుంది ఆరాధిస్తుంది.